
సాక్షి
అనంతపురం
ఆదివారం । 19 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



టమాట కిలో రూ.17

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
35.8°/20.1°

జిల్లా అంతటా శనివారం వాతావరణం మారింది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు పడ్డాయి.

న్యూస్‌రీల్

టీడీపీ హయాంలో కంటే ఎక్కువ పోస్టుల భర్తీ

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: టీడీపీ హయాంలో కంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఎక్కువ పోస్టులు భర్తీ చేశామని ఆ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టంచేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2019–20 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో 12,128 పోస్టులను భర్తీ చేశామన్నారు. మహిళా స్త్రీ, శిశు సంక్షేమం అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల నుంచి సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, ఏపీడీలు, ఆర్‌జేడీలు, ఇతర ఉద్యోగులతో కలిపి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, రెగ్యులర్ విధానంతో 12,128 పోస్టులను భర్తీ చేసి పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో 2014–19 వరకూ 4,018 పోస్టులను మాత్రమే భర్తీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. దీన్ని బట్టే ఏ ప్రభుత్వం మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖపై చిత్తశుద్ధితో పనిచేస్తుందో తెలుస్తుందన్నారు. బడ్జెట్‌లోనూ స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.3,951 కోట్లు కేటాయించామని సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

637 మంది విద్యార్థులు గైర్హాజర్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 637 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99 కేంద్రాల్లో 29,972 మంది విద్యార్థులకు గాను 29,335 మంది పరీక్షలు రాశారు. వీరిలో జనరల్ విద్యార్థులు 27,224 మందికి గాను 26,676 మంది హాజరయ్యారు. 2,748 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 2,659 మంది హాజరయ్యారు.

రేపటి ‘స్పందన’ రద్దు

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ‘స్పందన’ను రద్దు చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి.. సోమవారం అర్జీలు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో టెక్నికల్ అసిస్టెంట్ మృతి



వెంకట్రామిరెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన సద్దికూటి వెంకట్రామిరెడ్డి (43) శనివారం రాత్రి పంపనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు..వెంకట్రామిరెడ్డి అనంతపురం రూరల్ మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఆత్మకూరుకు వస్తుండగా, పంపనూరు దాటగానే కళ్యాణదుర్గం నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు వెంకట్రామిరెడ్డి ద్విచక్ర వాహనాన్ని రాంగ్‌రూట్‌లో వచ్చి బలంగా ఢీ కొట్టింది. దీంతో వెంకట్రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.మద్యం సేవించి, కారు నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలియజేశారు. ఘటనాస్థలం వద్ద ఉన్న స్థానికులు ప్రమాదానికి కారణమైన వారిని పోలీసులకు అప్పగించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకట్రామిరెడ్డికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. దశాబ్దకాలానికి పైగా ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, స్థానికంగా కూడా అందరితో కలుపుగోలుగా ఉండేవాడు.

ఉత్కంఠకు తెర

- ఎట్టకేలకు తేలిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం
- 60 గంటల పాటు కొనసాగిన ఓట్ల లెక్కింపు
- పీడీఎఫ్ ఓట్లతో గట్టెక్కిన రామగోపాల్‌రెడ్డి
- తొలి ప్రాధాన్యతలో స్పష్టమైన మెజారిటీ వెన్నపూసకే..
- విజయావకాశాలను దెబ్బతీసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు



రామగోపాల్ రెడ్డి



జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఉత్కంఠకు తెరపడింది. 60 గంటల సుదీర్ఘ కౌంటింగ్ అనంతరం ఎట్టకేలకు ఫలితం వెలువడింది. రెండో ప్రాధాన్యత ఓట్లు కలసిరావడంతో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. ఆయనకు 7,543 ఓట్ల మెజారిటీ లభించింది. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ సాధించడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి చవిచూశారు. రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లడం, తనకు వచ్చిన ఓట్లలోనూ పెద్దసంఖ్యలో ఇన్‌వ్యాలిడ్ కావడం వెన్నపూస ఓటమికి కారణాలు.

పీడీఎఫ్ ఓట్లే గెలిపించాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ పరస్పర అవగాహనతో పనిచేశాయి. ముఖ్యంగా రెండో ప్రాధాన్యత ఓట్లను పరస్పరం బదిలీ చేసుకున్నారు. ఫలితంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గట్టెక్కగలిగారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు 18వేల పైచిలుకు ఓట్లు లభించాయి. ఆయన ఎలిమినేషన్ సందర్భంగా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించగా.. ఇందులో ఎక్కువగా టీడీపీ అభ్యర్థికే దక్కాయి. దీనివల్లే టీడీపీ గెలిచినట్టు స్పష్టమవుతోంది. బీజేపీ అభ్యర్థి నగరూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓడిపోతామన్న భయంతో టీడీపీ నాయకులు ముందే పీడీఎఫ్ నేతలను బతిమాలి మరీ అవగాహన పెట్టుకున్నారు. ఇది వారికి కలిసొచ్చింది.

వివాదాలు, దౌర్జన్యాల నడుమ..

కౌంటింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు అలజడి సృష్టించారు. ఆ పార్టీ ప్రధాన నాయకులు స్వతంత్ర అభ్యర్థులకు ఏజెంట్లుగా వచ్చి కౌంటింగ్ కేంద్రంలోనే తిష్ట వేశారు. కౌంటింగ్ ఆద్యంతం అక్కడున్న సిబ్బందిని సైతం భయభ్రాంతులకు గురిచేశారు. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి చెందిన ఓట్లు సైతం కొన్ని టీడీపీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్సు వరకూ మాత్రమే కౌంట్ చేస్తామని, మొత్తం రీకౌంటింగ్ కుదరదని అధికారులు చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలపై అభ్యర్థి వెన్నపూసతో పాటు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. ఇందుకు నిరసనగా వెన్నపూస, విశ్వ కౌంటింగ్ కేంద్రం వద్ద కొద్దిసేపు ఆందోళన చేపట్టారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

సుదీర్ఘంగా కొనసాగిన ప్రక్రియ

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 18వ తేదీ రాత్రి 8 గంటలకు ముగిసింది. మూడు రోజుల పాటు బ్యాలెట్ బాక్సుల మధ్య ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు గడిపారు. తొలి రోజు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నువ్వా నేనా అంటూ ఊరించగా.. రెండో రోజు, మూడవ రోజు పట్టభద్రుల ఓట్ల లెక్కింపు, ఫలితాల సరళి నరాలు బిగుసుకుపోయేలా చేశాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులు టీవీల ముందు అతుక్కుపోయారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య మెజారిటీ తక్కువగా నమోదు కావడంతో ఏ రౌండులో ఏమవుతుందోనన్న ఉత్కంఠ కొనసాగింది.

షిఫ్టుల వారీగా విధులు

ఓట్ల లెక్కింపు సందర్భంగా 200 మంది రెవెన్యూ సిబ్బంది, మరో 200 మందికి పైగా పోలీస్ సిబ్బంది మూడు షిఫ్టులుగా పనిచేశారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. 12 మంది టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పోలైన 25 వేల పై చిలుకు ఓట్లు, 49 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు పోలైన 2.45 లక్షల ఓట్లను రాత్రింబవళ్లు లెక్కించారు.

మిశ్రమ ఫలితాలు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. టీచర్స్ ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి గెలుపొందగా, పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డి గెలుపొందారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడం వైఎస్సార్‌సీపీకిదే తొలిసారి. పోటీ చేసిన తొలిసారే బోణీ కొట్టడం విశేషం.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులకు వచ్చిన తొలిప్రాధాన్యత ఓట్లు

అభ్యర్థి	ఓట్లు
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)	95,969
బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ)	94,149
ఎన్.రాఘవేంద్ర (బీజేపీ)	7,412
పోతుల నాగరాజు (పీడీఎఫ్)	18,758
కమ్మూరు నాగరాజు (స్వతంత్ర)	1,632

‘రెండో ప్రాధాన్యత’ లెక్కింపు తర్వాత అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ)	1,09,781
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)	1,02,238
మెజారిటీ	7,543

పోలైన మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు
2,45,687

చెల్లని ఓట్లు
19,239

చెల్లిన ఓట్లు
2,26,448

ఎన్నికల ప్రక్రియ పూర్తి

- అధికారులు, సిబ్బంది, పోలీసులకు కలెక్టర్ అభినందనలు



కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో పరిశీలకులు పోలా భాస్కర్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల ఆర్‌ఓ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జేఎన్‌టీయూఏ కళాశాలలో పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం ముగిసిన తరువాత పరిశీలకులు పోలా భాస్కర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. అందరి సహకారంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసిందన్నారు. శాసన మండలి ఎన్నికలు విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేవరకు సహకరించిన ఎన్నికల అధికారులు, సిబ్బందికి, పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు.

వరుణ ప్రకోపం

- ఉపరితల ఆవర్తన ప్రభావం..
- వడగండ్లు, ఈదురుగాలుల బీభత్సం
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీగా దెబ్బ



శింగనమల మండలం కదవకల్లులో నేలకొరిగిన మొక్కజొన్న





శింగనమల మండలం మద్దిపల్లిలో నేలకొరిగిన అరటి చెట్లు, నాయనపల్లి క్రాస్- ఉల్లికల్లు మార్గంలో పడిన వడగండ్లు

అనంతపురం అగ్రికల్చర్ : వరుణుడు ప్రకోపించాడు. అకాల వర్షంతో విరుచుకుపడ్డాడు. ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు అనంతపురం, రాప్తాడు, తాడిపత్రి, గుత్తి, కూడేరు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, నార్పల, గార్లదిన్నె, ఆత్మకూరు, వజ్రకరూరు, యల్లనూరు, బొమ్మనహాళ్, విడపనకల్లు, పుట్లూరు తదితర మండలాల్లో వర్షం కురిసింది. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఉరవకొండ మండలం పెద్దముష్టూరు, మోపిడి, ఆమిద్యాలలో వడగండ్ల వానకు మామిడి తోటలు దెబ్బతిన్నాయి. శింగనమల చెరువు ఆయకట్టు పరిధిలోని 1500 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట నేలవాలగా... పలు గ్రామాల్లో అరటి చెట్లు విరిగిపడ్డాయి. గోవిందరాయునిపేటలో మామిడి, నేరేడు చెట్లు దెబ్బతిన్నాయి. నార్పల, పుట్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో అరటి, చీనీ, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, వరి, కొర్ర తదితర పంటలకు నష్టం వాటిల్లింది. మార్చిలో సాధారణ వర్షపాతం 2.1 మి.మీ కాగా 7 మి.మీ నమోదైంది. మొత్తం మీద గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 462.4 మి.మీ కాగా 41 శాతం అధికంగా 655 మి.మీ వర్షపాతం నమోదైంది.

మరో రెండు రోజులు వర్ష సూచన

రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదు కావచ్చన్నారు.

అందుబాటులో ఎరువులు



పైరుకు ఎరువు చల్లుతున్న రైతు



ఆర్‌బీకేలో నిల్వ చేసిన ఎరువులు

- 31,913 మెట్రిక్ టన్నులు సిద్ధం
- ఆర్‌బీకేలు, సొసైటీలకు మొదటి ప్రాధాన్యత
- ఖరీఫ్‌కు ముందస్తుగా అన్ని రకాల ఎరువులు సరఫరా
- వచ్చే ఖరీఫ్, రబీకి 1.75 లక్షల మెట్రిక్ టన్నులతో ప్రణాళిక

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉంచింది. ఎరువుల సమస్య ఉత్పన్నం కాకుండా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ కంపెనీల ద్వారా వచ్చిన ఎరువులు మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీల)కు సరఫరా చేస్తున్నారు. మిగతావి హోల్‌సేల్, రిటైల్ డీలర్లతో పాటు వేర్‌హౌస్‌లు, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.

31,913 మెట్రిక్ టన్నులు

జిల్లా వ్యాప్తంగా 31,913 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచారు. అందులో కాంప్లెక్స్ ఎరువులు అత్యధికంగా 14,277 మెట్రిక్ టన్నులు, యూరియా 9,273 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,767 మెట్రిక్ టన్నులు, మ్యురేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ) 1,423 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ (ఎస్ఎస్‌పీ)1,085 మెట్రిక్ టన్నులు, కాంపోస్ట్ ఎరువులు 88 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో వేర్‌హౌస్‌లలో 10,061 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల వద్ద 4,112 మెట్రిక్ టన్నులు, ఆర్‌బీకేల్లో 1,793 మెట్రిక్ టన్నులు, రిటైల్ దుకాణాలు, సొసైటీల పరిధిలో 15,9917 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

ప్రణాళిక ప్రకారం ఎరువులు

మండలాలు, గ్రామాల వారీగా వరి, వేరుశనగ లాంటి వ్యవసాయ, అరటి, చీనీ, మామిడి, కూరగాయలు లాంటి ఉద్యాన పంటల విస్తీర్ణం, వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని తగినంత సరఫరా, నిల్వలు ఉంచారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ తెలిపారు. మే నుంచి ప్రారంభం కానున్న 2023–24 ఖరీఫ్, రబీకి అవసరమైన 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు ఇటీవలే కమిషనరేట్‌కు పంపినట్లు తెలిపారు. అనుమతులు రాగానే నెల వారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు సరఫరా అయ్యేలా చూస్తామని తెలిపారు. రైతులకు గ్రామాల్లోనే ఎరువులు లభించేలా ఆర్‌బీకేలు, సొసైటీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎంఎస్‌పీకి మించి అమ్మకుండా, అలాగే డీబీటీ పద్ధతి (ఆన్‌లైన్ విధానం)లోనే క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

పేదపిల్లల ఉన్నత విద్యకు ప్రోత్సాహం

- నేడు విద్యా దీవెన సొమ్ము విడుదల
- జిల్లాలో 38,268 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.28.25 కోట్ల జమ

అనంతపురం రూరల్: పేద పిల్లలకు ఉన్నత విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. జగనన్న విద్యా దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలోకి నగదు జమ చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత ఫీజు మొత్తాన్ని తల్లుల ఖాతాలోకి నగదు జమ చేసే కార్యక్రమాన్ని ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. అనంతపురం జిల్లాలో 38,268 మంది తల్లుల ఖాతాలోకి రూ.28.25 కోట్ల నగదు జమ కానుంది. 42,115 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. నేడు జగనన్న విద్యా దీవెన నగదు జమ కార్యక్రమాన్ని నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు.

జగనన్న విద్యాదీవెన నగదు జమ ఇలా..

కులం	విద్యార్థులు	తల్లుల సంఖ్య	నగదు జమ
ఎస్సీ	7.572	6,857	రూ. 6.48 కోట్లు
ఎస్టీ	1.648	1.468	రూ.0.96 లక్షలు
బీసీ	20.988	19.022	రూ.12.23 కోట్లు
కాపు	2,213	2.081	రూ.1.50 కోట్లు
ఈబీసీ	5.624	5,159	రూ.4.72 కోట్లు
ముస్లిం	3.971	3,591	రూ.2.30 కోట్లు
క్రిస్టియన్	99	90	రూ.0.06 లక్షలు

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తి మృతి


వడ్డే పెద్దన్న (ఫైల్)

ఆత్మకూరు: విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి వ్యక్తి ప్రాణాలు విడిచిన సంఘటన ఆత్మకూరు మండలం సిద్దరాంపురం వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన వడ్డే పెద్దన్న (35) ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే పనులకు వెళ్లేవాడు. శనివారం సిద్దరాంపురం వద్ద పనులకు వెళ్లాడు. ఈ క్రమంలోనే విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా కాలు జారి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే ప్రాణాలు వదిలాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. వడ్డే పెద్దన్నకు భార్య సుకన్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కాళ్లపారాణి ఆరకనే కాటికి..

- నవవధువు అనుమానాస్పద మృతి
- కట్టుకున్నోడే చంపాడని బంధువుల ఆరోపణ

పెళ్లి సందడి, తీపి జ్ఞాపకాల్లోంచి బంధువులు, ఆత్మీయులు ఇంకా బయటకురానేలేదు. పెళ్లై పట్టుమని వారం రోజులు కూడా గడవలేదు. కట్టుకున్న భర్తతో మూడు రోజులు కలసి లేదు. ఏం కష్టమొచ్చిందో కూడా ఎవరికీ అర్థం కావడం లేదు.. ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్న ఓ యువతి అయినవాళ్లను శోకసంద్రంలోకి నెట్టింది. శుభకార్యం ఘనంగా జరగడంతో మొక్కు తీర్చుకుందామని తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధికి వెళ్లిన తల్లిదండ్రులు పిడుగులాంటి వార్త విని హతాశులయ్యారు. హుటాహుటిన ఘటనాస్థలం చేరుకుని కుమార్తె మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు.

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కాళ్ల పారాణి కూడా ఆరకముందే ఓ నవ వధువు అనుమానాస్పద రీతిలో మరణించింది. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన మేరకు.. బళ్లారి జిల్లా కూడ్లిగి తాలూకా చిరుమనెహళ్లికి చెందిన శశికళ (20) స్థానిక ఐరన్ బ్రిడ్జి వద్ద ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో పనిచేసేది. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసే ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన రమేష్ నాయక్‌తో ఈ నెల 12న ఈమెకు వివాహం జరిగింది. 13న కొత్త దంపతులు శశికళ పుట్టింటికి వెళ్లారు. 14న అనంతపురం వచ్చారు. ఇల్లు ఇంకా ఎక్కడా సరిపోలేదని రెండు రోజులు శశికళను హాస్టల్‌లో ఉంచిన రమేష్‌నాయక్ 16వ తేదీన నాల్గవరోడ్డు సమీపంలోని ఎస్‌వీఎస్‌ఆర్ అపార్టుమెంటుకు తీసుకెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు గాని మరుసటి రోజు అంటే 17వ తేదీ రాత్రి శశికళ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది.

భర్త ప్రవర్తనపై అనుమానాలు..

కొత్త దంపతులు ఇంట్లో ఇద్దరే ఉంటున్నారు. శుక్రవారం రాత్రి శశికళకు, ఆమె భర్త రమేష్‌నాయక్ మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే శశికళ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఘర్షణ జరిగిన కొద్దిసేపటికే తనను లోపలి గదిలో పెట్టి బయట తలుపులకు శశికళ తాళం వేసినట్లు రమేష్‌నాయక్ చెబుతున్నాడు. బయట వాళ్ల సాయం కోసం గట్టిగా కేకలు వేస్తే వచ్చి తలుపులు విరగ్గొట్టారని తెలిపాడు. అయితే, అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్‌లోకి వచ్చి తలుపులు తీసిన వారెవరో చెప్పడంలేదు. పైగా శశికళ ఫ్యాన్‌కు ఉరి వేసుకునేందుకు ఎత్తు కోసం ఎలాంటి కుర్చీగాని ఉపయోగించలేదు. ఇంత జరిగినా శశికళ కుటుంబ సభ్యులకు శనివారం ఉదయం 10.30 వరకు సమాచారం ఇవ్వలేదు. 11 గంటల సమయంలో ఫోన్ చేసి మీ పాప ఉరివేసుకుంది, కొన ఊపిరితో ఉందని ఆస్పత్రికి తీసుకెళుతున్నామని చెప్పాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో శశికళ చనిపోయిందని తెలిపాడు. పోలీసులకు కూడా ఉదయం 10.30 వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో రమేష్ ప్రవర్తనపై బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సీఐ కత్తి శ్రీనివాసులు


శశికళ, రమేష్‌నాయక్ పెళ్లినాటి ఫొటో

హతమార్చాడని ఆరోపణ

రమేష్‌నాయక్ వ్యవహారంపై శశికళకు అనుమానం వచ్చినట్లు తెలుస్తోంది. అతనికి మరొకరితో సంబంధాలున్నాయని, ఈ విషయం తెలియడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతోనే ఆమెను హతమార్చి ఉండవచ్చని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

కన్నీరు మున్నీరైన కన్నవారు..

నాలుగురోజుల క్రితం నవ్వుతూ అత్తారింటికి వెళ్లొస్తానని చెప్పిన కూతురిని గుర్తు చేసుకుని తండ్రి ఠాగూ ర్‌నాయక్ రోదించిన తీరు అందరినీ కలచివేసింది. ఠాగూరునాయక్‌ది అతి పెద్ద కుటుంబం. ఏడుగురు అన్నదమ్ములు. అంతా కలిసే ఉంటున్నారు. ఠాగూర్ నాయక్‌కి ఐదుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. అందరిలో చిన్నదైన శశికళంటే ఆ కుటుంబానికి చాలా ఇష్టం. ''తిరుమల వెంకన్న స్వామి దయతో బిడ్డ పెళ్లి బాగా జరిపించానని సంబరపడ్డా. నా బాధ్యత సంతృప్తిగా తీర్చుకోవడానికి తిరుమల వేంకటేశ్వరస్వామి దయేనని తలచి మొక్కు తీర్చుకునేందుకు 16వ తేదీ భార్య జయబాయితో కలిసి వెళ్లా. తీరా ఉదయం ఫోన్ చేసి బిడ్డ చనిపోయిందని చెప్పారు'' అంటూ ఆయన విలపించిన తీరు కన్నీరుపెట్టించింది.

అక్కకు బంగారం ఇద్దామని..

శశికళ తమ్ముడు, వైద్య విద్యార్థి అయిన విశ్వనాథ్ నాయక్ శనివారం ఉదయం అనంతపురం రావాల్సి ఉంది. 'ఈ విషయంపై నిన్న అక్కతో మాట్లాడా. రేపు మా ఇంటికి వస్తావా? అని పిలిచింది. ఉదయాన్నే అక్కబావ వద్దకు వెళ్లాలని ఎంతో సంతోషపడ్డా. ఇంతలో ఇలా జరిగిపోయిందంటూ సోదరుడు కూడా గుండెలవిసేలా రోదించాడు.

కేసు నమోదు: త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. బిడ్డ చావుకు అల్లుడే కారణమని బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

మహిళ ఆత్మహత్య

శింగనమల: భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని కల్లుమడిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కల్లుమడికి చెందిన దివాకర్ తాగుడుకు బానిసయ్యాడు. భార్య శ్రావణి (24) ఎన్ని సార్లు చెప్పినా మారలేదు. దీంతో మనస్తాపం చెందిన శ్రావణి శనివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

అల్లుడిపై కొడవలితో మామ దాడి

- కుమార్తెను వేధిస్తున్నాడని ఘాతుకం


గాయపడిన రియాజ్

పెనుకొండ రూరల్: కుమార్తెను వేధిస్తున్నాడని అల్లుడిపై మామ దాడి చేశాడు. పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకొంది. బాధితుని తల్లి షేక్ ఫక్ర న్నీషా వివరాల మేరకు.. చిలమత్తూరుకు చెందిన ఫక్రుద్దీన్ కుమార్తె నసీమా భానుతో ఆమె పెద్ద కుమారుడు రియాజ్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో శుక్రవారం సాయంత్రం గొడవ జరగ్గా నసీమా భాను తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో అమ్మవారిపల్లికి చేరుకున్న ఫక్రుద్దీన్ తన అల్లుడిని బయటకు రమ్మని పిలిచాడు. వెంట తెచ్చుకొన్న కొడవలితో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రియాజ్‌ను హుటాహుటిన గుట్టూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలు తీసుకెళ్లారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నారు.

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కర్ణాటక, కడప, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశుని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. తీర్థప్రసాదలు అందించి, అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కారులో సూర్యతేజ మృతదేహం

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కనంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన మేరకు.. హైదరాబాద్ హిమాయత్ నగర్‌కు చెందిన వెంకట సూర్యతేజ (26) ఆగ్రో కంపెనీ ఉద్యోగి. శనివారం ఉదయం బెంగళూరులో పని నిమిత్తం హైదరాబాద్ నుంచి బయలుదేరాడు. కనంపల్లి క్రాస్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ ఢీకొని అవతలి వైపు వస్తున్న లారీని ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన సూర్యతేజ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న సూర్యతేజ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

కరువును తరిమేద్దాం

- ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్


మాట్లాడుతున్న పుల్లెల గోపీచంద్

అనంతపురం కల్చరల్: జిల్లాలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించి కరువును తరిమేద్దామని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శనివారం శ్రీజీ ప్రకృతి ధర్మపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పుల్లెల గోపీచంద్, ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాస్, ఏఎస్పీ హనుమంతు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆదరణ రామకృష్ణ, ఎన్‌ఆర్‌సీ కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్ తదితరులు ఆత్మీయ అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా మొక్కలు నాటితే భవిష్యత్తులో అందరికీ చల్లని నీడ లభిస్తుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి ధర్మపీఠం ట్రస్టు కోటి వృక్ష మహోత్సవాన్ని దిగ్విజయంగా కొనసాగించడం శుభపరిణామమన్నారు. ఎప్పుడు పిలిచినా వస్తానని తెలిపారు. చెట్ల ఆవశ్యకతను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి కవితారూపంలో చక్కగా వినిపించారు. ప్రకృతి ప్రాధాన్యతను తెలిపే ఓ పాటను లెనిన్ ఆలపించి ఆకట్టుకున్నారు.అనంతరం న్యాయవాది పద్మజ, బ్రహ్మకుమారీ సిస్టర్ శారద, వివేకానంద యోగా ట్రస్టు రాజశేఖరరెడ్డి,కోగటం విజయభాస్కరరెడ్డి, ఏఎస్పీ హనుమంతు,ఎస్వైకే అధికారి శ్రీనివాస్‌తో పాటు 40 మందికి ఉగాది పురస్కారాలనందించారు.

ఆరుగురు విద్యార్థుల డీబార్

అనంతపురం: డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ 6 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతలో నలుగురు, కదిరిలో ఇద్దరు డీబార్ అయ్యారు.

నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణాలు బలి

- ఆటోడ్రైవర్ తప్పిదంమే పోట్లమర్రి ప్రమాదానికి కారణం!
- ప్రయాణికులతో మాట్లాడేందుకు వెనక్కు చూసిన ఆటో డ్రైవర్
- అదే సమయంలో ఎదురుగా వచ్చి ఢీకొట్టిన బొలెరో

బత్తలపల్లి: మండల పరిధిలోని పోట్లమర్రి సమీపంలో శుక్రవారం రాత్రి బొలెరో వాహనం, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదానికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం రాత్రి ధర్మవరం పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ తన్నీరు నరసింహులు(55) బత్తలపల్లిలో ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో పోట్లమర్రికి చెందిన బత్తల మల్లేసు(48), ఓబుళాపురం గ్రామానికి చెందిన హాజీఫీరా(50), ముదిగుబ్బ మండలం నల్లాయకుంటపల్లికి చెందిన తలారి నారాయణస్వామి(60), గొట్లూరు గ్రామానికి చెందిన దాసరి ఈశ్వరయ్య(40), ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన ఫయాజ్(50) తన ఎనిమిదేళ్ల కుమార్తె షాహిస్తా, గొట్లూరు గ్రామానికి చెందిన రంగస్వామి మొత్తం ఏడుగురు ఆటో ఎక్కారు. అయితే మరికొంత మంది ప్రయాణికుల కోసం చూస్తున్న ఆటో డ్రైవర్ నరసింహులు ఆటోను ముందుకు, వెనక్కు నడుపుతున్నారు. 'ఇంక రారులే ఆటో పోనీ' అని ప్రయాణికులు ఒత్తిడి చేయడంతో గొనుక్కుంటూనే ఆటోను ముందుకు కదిలించాడు. ఆటో వెళ్తున్న సమయంలోనూ ఆటో డ్రైవర్ నరసింహులు 'ఇంకొంతమంది ఎక్కింటే సరిపోవు' అంటుంటే ఆటోలో ప్రయాణిస్తున్న రంగస్వామి 'ఇంకా చాలరా.... ఇంతమంది' అని అన్నాడు. దీంతో 'ఎవరు మాట్లాడింది' అంటూ డ్రైవర్ వెనక్కు చూశాడు. దీంతో 'ముందుకు చూడు గుద్దుతావ్' అంటుండగానే ఆటో స్టీరింగ్ కుడిపక్కకు తిరగడం, అదే సమయంలో ఎదురుగా బొలెరో వాహనం రావడంతో రెండూ వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఫయాజ్, షాహిస్తా, రంగస్వామితో పాటు తాడిమర్రి మండలం నార్శింపల్లి గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఫయాజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, ఆయన కుమార్తె షాహిస్తా పరిస్థితి విషమంగా ఉంది. దీంతో షాహిస్తాతో పాటు మిగతా ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అంతకుముందు శుక్రవారం రాత్రి ఘటనా స్థలంలోని మృతదేహాలను వాహనాల్లోకి ఎక్కించేందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డిలు పోలీసులకు సహకారం అందించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం

పోట్లమర్రి ప్రమాదం నేపథ్యంలో మరోసారి ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించేలా ఆటో, చిన్నపాటి వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

సీఎంను కలసిన రమేష్‌గౌడ్



అనంతపురం క్రైం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ శనివారం అమరావతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం లభిస్తోందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పంపనూరు హుండీ కానుకల ఆదాయం రూ.11 లక్షలు



హుండీ కానుకల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకల ఆదాయాన్ని ఆలయ ఈఓ అక్కిరెడ్డి , ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించారు. సాయంత్రం వరకు హుండీ కానుకలు లెక్కించగా, రూ.11,00,894 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

అనాథ విద్యార్థినులకు అవోపా వితరణ

అనంతపురం కల్చరల్: అవోపా మహిళా విభాగం చంద్రకళ, అనురాధ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీనగర్‌లోని అనాథ, బాలికలకు నిత్యావసర వస్తువులు శనివారం అందించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈసందర్భంగా మేడా రామలక్ష్మి చేతుల మీదుగా బియ్యం, బేడలతో పాటు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా నిర్వాహకులు ఇందిర, భువన తదితరులు పాల్గొన్నారు.

నవభారత్ స్కూల్‌లో సరస్వతీ పూజ



పాఠశాల కరస్పాండెంట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో విద్యార్థులు

రాప్తాడురూరల్: అనంతపురం నగరం ఆజాద్‌నగర్‌లోని నవభారత్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతీ పూజ ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. ప్రతిఒక్కరూ మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, గురుప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆప్కో వస్త్రాలపై ఉగాది, వేసవి ఆఫర్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆప్కోలో చేనేత వస్త్రాల క్లియరెన్స్ సేల్ పేరుతో బంపర్ ఆఫర్లు ప్రకటించినట్లు ఆప్కో డివిజనల్ మార్కెట్ ఆఫీసర్ భారతి ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది, వేసవి కాలం సందర్భంగా ఒకటి కొనుగోలు చేస్తే ఒకటి ఉచితం, ఒకటి కొంటే రెండు ఉచితం ఆఫర్లను ప్రకటించారు. నగరంలోని సైఫుల్లా బ్రిడ్జి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్కో దుకాణంలో క్లియరెన్స్ సేల్ ప్రారంభించినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బోయ రామకృష్ణ (ఫైల్)

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన బోయ రామకృష్ణ (42) బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు.. రాప్తాడుకు చెందిన బోయ రామకృష్ణ, అతని భార్య సుశీల ఈనెల 5న పెనుకొండ నుంచి వస్తుండగా చెన్నేకొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారిపై కారు అతివేగంగా వచ్చి వెనుకవైపు నుంచి ఢీకొనింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణను 108 వాహనం ద్వారా అనంతపురం, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా న్యాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, జిల్లా అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ సర్వేయర్, ప్లంబింగ్, శానిటేషన్ విభాగాల్లో మూడు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి ఆపై చదివిన యువతీయువకులు ఈనెల 30 లోపు న్యాక్ సెంటర్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 7019425587, 7013858450 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ ఆలయంలో శనివారం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుక్మిణీ పాండురంగస్వామి ప్రతిమలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు.

కుక్కల నియంత్రణకు కసరత్తు

- సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్లు, కమిషనర్ నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: నగరంలో కుక్కల బెడదకు అడ్డుకట్ట వేసేందుకు పాలకవర్గం కసరత్తు ప్రారంభించింది. శనివారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి , కార్యదర్శి సంగం శ్రీనివాసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుక్కలను పట్టుకునేందుకు తమిళనాడుకు చెందిన ఓ ఏజెన్సీ ముందుకొచ్చిందని కమిషనర్ రమణారెడ్డి మేయర్‌కు తెలిపారు. అనిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల మేరకు కుక్కలకు స్టెరిలైజేషన్ (ఆపరేషన్) చేసి సంతానోత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవడం, కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాల్సి ఉంటుందన్నారు.

రోడ్లపై బురద తొలగించాలి :

వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన బురద తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులను మేయర్ వసీం ఆదేశించారు. శనివారం నగరంలోని 37వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో రోడ్లపై బురద ఉండడంతో తక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించగా, వారు చర్యలు తీసుకున్నారు. కాలువలు బ్లాక్‌లను తీసేయాలన్నారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ కోగటం పర్యటన:

నగరంలోని 32వ డివిజన్ ఆదర్శనగర్, విద్యుత్‌శక్తినగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ కమల్‌భూషణ్‌తో కలసి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పర్యటించారు. వర్షపు నీరు ప్రవాహంలా వెళ్లేలా కాలువల్లో పూడికను తొలగించేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆయన ఆదేశించారు. డిప్యూటీ మేయర్ వెంట నాయకులు కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రాయితీలపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణయ్య

కనగానపల్లి: ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏ కృష్ణయ్య ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రబీ పంటల సాగు, పొలంబడి, వ్యవసాయ రాయితీలపై సిబ్బందితో చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు పీఎం కిసాన్- వైఎస్సార్ రైతు భరోసా పరిహారం అందని రైతులతో ఈ కేవైసీ చేయించాలన్నారు. సమావేశంలో ఏఓ కృష్ణకుమారి, పలువురు వీఏఏలు, వీఎస్‌ఏలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌గా రమణారెడ్డి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఉన్న రమణారెడ్డిని కమిషనర్‌గా (ఎఫ్‌ఏసీ) నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కమిషనర్ భాగ్యలక్ష్మి ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. ఆమె 15 రోజుల పాటు మెడికల్ సెలవులో వెళ్లారు. కమిషనర్ తిరిగి బాధ్యతలు తీసుకునే వరకు అదనపు కమిషనర్ రమణారెడ్డికి ఫుల్ అడిషనల్ చార్జ్ ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బాధ్యతలు తీసుకున్న రమణారెడ్డికి నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు సతీష్, సుజాత, శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, ఆర్‌ఐలు మురళీ, వేణు, తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అనధికార నిర్మాణాలపై దృష్టి సారించండి:

నగరంలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణాల్లో ఉన్న అనధికారంగా షెడ్లు ఏర్పాటు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేయాలని పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు.

రూ.44.71 లక్షల పన్ను వసూలు

ఇంటి, ఖాళీ జాగా పన్నుకు ఒకే సారి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని ప్రభుత్వం ప్రకటించడంతో పన్ను వసూళ్లు ఊపందుకున్నాయి. శనివారం నగరంలోని నగరపాలక సంస్థ, పాతూరు, రెండో రోడ్డు, రాంనగర్‌లోని సచివాలయాల్లోని కౌంటర్లలో బకాయిదారులు పన్ను చెల్లించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. శనివారం ఒకే రోజు రూ.44.71 లక్షలు వసూలైంది. అందులో ఇంటి పన్ను రూ.40 లక్షలు, ఖాళీ జాగా పన్ను రూ.1,21,000, నీటి పన్ను రూ.3,50,000 వసూలైంది.

నేడు పన్ను చెల్లింపులకు అవకాశం :

ఆదివారం సెలవు దినం రోజు అయినా పన్ను చెల్లింపునకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ రమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థలో, పాతూరు, రెండో రోడ్డు, రాంనగర్‌లోని సచివాలయాల్లో పన్ను చెల్లించేందుకు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, బకాయిదారుల ఇంటికి వెళ్లి పన్ను వసూలు చేసేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు.

20 అనధికార భవనాలకు చార్జ్‌షీట్లు

నగరంలోని కమలానగర్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రాంతాలు, వేణుగోపాల్‌నగర్, ప్రశాంతి నగర్, తదితర ప్రాంతాల్లోని 20 అనధికారి భవనాలకు నగరపాలక సంస్థ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. భవనాల అనుమతులు తీసుకొని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టిన ఆయా భవనాలకు రూ.లక్షల్లో పెనాల్టీ వేస్తూ చార్జ్‌షీట్లు వేశారు. మొత్తం నిర్మాణదారులు రూ.కోట్లలో నగరపాలక సంస్థకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి సంబంధిత చార్జ్‌షీట్ ఫైళ్లపై సంతకం చేసినట్లు సమాచారం. ఇంకా విద్యుత్‌నగర్, హౌసింగ్ బోర్డు, సాయినగర్, తదితర ప్రాంతాల్లోని అనధికార భవనాలకు చార్జ్‌షీట్లు సిద్ధం చేశారు. చార్జ్‌షీట్లు దాఖలు చేయడంతో నిర్మాణదారుల్లో వణుకుపుట్టుకుంది. గతంలోనే నగరపాలక సంస్థ అధికారులు వందకుపైగా భవనాలకు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: చిరుధాన్యాల సాగుతో ఆదాయంతోపాటు ఆరోగ్యం సమకూరుతుందని ప్రశాంతి గ్రామైక్య సంఘం సభ్యులు మహిళా రైతులకు పేర్కొన్నారు. మిల్లెట్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం నక్కనదొడ్డి గ్రామంలో ప్రశాంతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆనవాయితీగా వేరుశనగ పంటపైనే ఆధారపడటం, పంట మార్పిడి చేపట్టకపోవడం వంటి కారణాలతో తరచూ పంట నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని పంచేలా కొర్రలు, రాగులు, సద్దలు, జొన్నలు, సామలు, అరికెలు, పెసలువంటి పంటలను సాగు చేయాలని కోరారు.

పెద్దవడుగూరు : చిరుధాన్యాల తినడం ద్వారా మనిషి ఆరోగ్యంగా ఉండొచ్చని ఎఫ్‌పీఓ ఏపీఎం శారద, సీసీ పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక గ్రామ సంఘం కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జొన్న, కొర్ర, సజ్జలు, రాగి లాంటి ధాన్యాలతో వంటలు తయారు చేసుకొని తినడం వలన కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని కోరారు.

ప్రకృతిని కాపాడుకుంటే రోజూ పండగే



ఉగాది సేవా పురస్కారాలను అందిస్తున్న ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు రూరల్: ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోగలిగితే మన కు రోజూ పండగేనని రైల్వే ఎస్పీ కే.చౌడేశ్వరి పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో సమాజ సేవకులకు ఉగాది పురస్కారాల ప్రదానం చేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రైల్వే ఎస్పీ హాజరై మాట్లాడారు. ప్రకృతిలో పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి వంటి వాటిని సక్రమంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం ఆమె పలువురికి ఉగాది సేవా పురస్కారాలను అందజేశారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

యల్లనూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఏకాంతోత్సవంతో శ్రీవారు ఊరేగింపుగా వెళ్లారు. భక్తులు స్వామి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

ఆత్మకూరు: మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కోవిడ్ సమయంలోనూ, ఇటీవల కార్డుదారులకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేసింది. కొందరు వ్యాపారులు కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, బియ్యాన్ని పాలిష్ చేసి కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మకూరు మండలానికి చెందిన కొందరు చిరువ్యాపారులు కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కిలో రూ.10 చొప్పున కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇటీవల కాలంలో వరుసగా రేషన్ బియ్యం రవాణా చేస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా మండలం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని రెవెన్యూ సిబ్బంది సివిల్ సప్లయ్ గోదాముకు తరలిస్తారు. కానీ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విషయాన్ని చెప్పడంలేదు.

- ఈనెల 5న మండలంలో రెండు చోట్ల 81 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని, వాహనాలను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.
- ఈనెల 17న ఆత్మకూరు సమీపంలోని సింగనగుట్ట వద్ద విజిలెన్స్ అధికారులు 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేశారు. పి.యాలేరు క్రాస్‌లో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యుగంధర్



రాప్తాడు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ యుగంధర్

రాప్తాడు: ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఐఓ యుగంధర్ హెచ్చరించారు. ఆయన శనివారం ప్రసన్నాయపల్లి, రామినేపల్లి గ్రామాల్లో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఇమ్యునైజేషన్ రికార్డులు పరిశీలించారు. అనంతరం రాప్తాడులో పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రత, మందుల గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకునేలా అగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం మినహా రోజూ వైద్యాధికారులు క్యాంపులకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణి, శివకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేయండి

గుంతకల్లు రూరల్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్యారోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వీరబ్బాయి సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్లతోపాటు, పాతకొత్తచెరువు, వెంకటాంపల్లి హెల్త్ సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి, సబ్ సెంటర్లను పనితీరుపై ఆరా తీసిన ఆయన అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి వారికి అవసరమైన వైద్యం అందించాలన్నారు. డెమో ఆఫీసర్ భారతి, డిప్యూటీ డెమో ఆఫీసర్ త్యాగరాజు ఆయన వెంటున్నారు.

బోరుబావిలోకి రాళ్లు వేసి పూడ్చారు

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన లక్ష్మీదేవికి చెందిన బోరుబావిని గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి, పూడ్చివేశారని బాధితురాలు శనివారం ఆవేదన వ్యక్తం చేసింది. లక్ష్మీదేవి పూలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. బోరుబావి తవ్వించి, మోటారు ఏర్పాటుకు డబ్బులు లేక బోరుబావిపై కేసింగ్ పైపు కప్పి ఉంచింది. బోరు రంధ్రంలోకి రాళ్లు వేయడంతో మూతపడిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

పాత డీఈఓఆఫీస్ భవన మరమ్మతుకు చర్యలు



పరిశీలిస్తున్న ఈఈ శివకుమార్

రాప్తాడురూరల్: పాత డీఈఓ ఆఫీస్ భవన మరమ్మతులకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. డీఈఓ ఎం. సాయిరాం ఆదేశాల మేరకు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్ శనివారం కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న భవనానికి పైన స్లాబు వేసి, కింద పైన మరుగుదొడ్లు నిర్మించి, భవనం మొత్తానికి మరమ్మతులు చేసి రంగులు వేయడం, బిల్డింగ్ కూలగొట్టి, కొత్త భవనం నిర్మిస్తే ఎంత ఖర్చవుతుందనే అంచనాలు తయారు చేశారు. రెండు ప్రతిపాదనలను విద్యాశాఖ అధికారులకు పంపిస్తామని ఈఈ తెలిపారు. డీఈ రమణారెడ్డి, ఏఈ రాజశేఖర్ రెడ్డి, డీఈఓ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నా పాట సూడు నాటు..నాటు

- అదరగొట్టిన మెడికల్ కళాశాల విద్యార్థులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: సినిమా పాటలకు డ్యాన్సులతో అనంతపురం మెడికల్ కళాశాల విద్యార్థులు అదరగొట్టారు. ఈ నెల 20న నిర్వహించనున్న ఫ్రెషర్స్ డేను పురస్కరించుకుని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం కళాశాలలో సందడిగా చేపట్టారు. ఫ్లాష్ మాబ్ పేరున సినీ గీతాలు, డీజే పాటలతో కళాశాల ప్రాంగణాన్ని హోరెత్తించారు. నా పాట సూడు నాటు నాటు, డీజే టిల్లు పేరు వీడి స్టైలే వేరు, పల్సర్ బైక్, చూపుల్తో గుచ్చి గుచ్చి, గాజువాక పిల్ల మేము గాజులోళ్లం కాదా లాంటి పలు పాటలకు హుషారెత్తించే డ్యాన్సులు చేసి అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శారోన్ సోనియా, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్యాంప్రసాద్, భవాని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలను మొబైల్‌లో బంధిస్తున్న విద్యార్థినులు



మెడికల్ కళాశాల విద్యార్థులతో నాటు నాటు అంటూ స్టెప్పులు వేస్తున్న సూపరింటెండెంట్లు ఆత్మారాం, సుబ్రహ్మణ్యం